

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 30-08-2025 | సంపుటి - 24 | సంచిక - 112 | రూ : 4 | పేజీలు: 8




## సిగాచీ ఘటనపై నిపుణుల నివేదిక రావాల్సి ఉంది

- బాధితులకు అండగా ప్రభుత్వ శాఖలు
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో జరిగిన భారీ ప్రమాదంలో 46 మంది మృతి చెందడంతోపాటు 8 మంది అదృశ్యమైన ఘటనపై దర్యాప్తుచేసి, బాధ్యులను గుర్తించడానికి ఐదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని నియమించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు హైకోర్టుకు నివేదించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపైనా నివేదిక సమర్పించాలని

తరువాయి 2లో

# అన్ని విద్యాసంస్థల్లో ముఖ గుర్తింపు హాజరు

- బోధనా సిబ్బంది, విద్యార్థులకు తప్పనిసరి..
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండాలి
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



హైదరాబాద్: పాఠశాలల నుంచి వర్సిటీల వరకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలని, అందుకు అనుగుణంగా బోధనా సిబ్బందితోపాటు విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని తప్పనిసరి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరుశాతం మెరుగుపడుతుందని, వివిధ లోటుపాట్లనూ అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. శుక్రవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై.. సీఎం మూడు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. విద్యారంగంపై చేస్తున్న ఖర్చును వ్యయంగా కాకుండా...పెట్టుబడిగా చూస్తున్నామని ఈ సందర్భంగా సీఎం స్పష్టంచేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

*** సీఎం ఆదేశాలు...నిర్ణయాలు ఇవీ...**

విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదు. నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు,

తరువాయి 2లో

## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే...

### : టోక్యోలో మోదీ

- టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రధాని మోదీ ప్రసంగం
- ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపే చూస్తోందన్న ప్రధాని
- త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ధీమా



2లో

## హైదరాబాద్‌లోని.. పలు ప్రాంతాల్లో భారీ వర్షం

- అమీర్‌పేట, బంజారాహిల్స్, మణికొండ, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం
- విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే వారికి ఇబ్బందులు
- ఫ్లైఓవర్ల కింద, బస్‌స్టాప్‌ల వద్ద తలదాచుకున్న ప్రయాణికులు

2లో






## రామసేతుకు జాతీయ హోదా

: కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

2లో

## ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఏపీకి లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

### : హరీశ్ రావు ఆగ్రహం

- ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- దేశానికి ఫ్రూట్ కేపిటల్, ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ఉందన్న ముఖ్యమంత్రి
- రూ. 200 కోట్లు దాటిన ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడి
- 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్న సీఎం
- 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కింద ముందుకు రావాలని యువతకు పిలుపు




2లో



2లో

## రేవంత్ రెడ్డిని కలిసి, కీలక విన్నపం చేసిన ఒవైసీ సోదరులు

- మిలాద్-ఉన్-నబీ వేడుకలపై సీఎంకు వినతిపత్రం అందజేత
- ప్రాచీన మసీదులు, దర్గాల అలంకరణకు ఉచిత విద్యుత్ కోరిన నేతలు
- సెప్టెంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా జులూస్‌కు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి

## చైనాతో బంధంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు..



2లో

- చైనాతో సంబంధాల బలోపేతానికి భారత్ సిద్ధంగా ఉంది
- పరస్పర గౌరవం, ప్రయోజనాలే కీలకం అన్న ప్రధానమంత్రి మోదీ
- జపాన్ పర్యటనలో ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడి
- ఎస్సీఓ సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు ప్రధాని పయనం
- భారత్-చైనా బంధం ప్రపంచ శాంతికి దోహదపడుతుందని వ్యాఖ్య

## మౌనంగా రోదిస్తోంది నా మాతృభాష..?

ఆంగ్ల భాష మీద
అభిమానం ఉండవచ్చు
కానీ మాతృ భాష మీద
మమకారం లేకపోతే ఎలా..?

ఆంగ్ల మమ్మీ పై
ఆశ ఉండవచ్చు,
కానీ తెలుగు తల్లి పై
ఆప్యాయత లేకపోతే ఎలా...?

తెల్లని తల్లికి
నల్లని తండ్రికి పుట్టి...
"అమ్మా - నాన్న" అనలేక...
"మమ్మీ - డాడీ" అని పిలవలేక...
తల్లి ఆలనకు తండ్రి పాలనకు దూరమై
తాగేందుకు తల్లిపాలు పోతపాలు లేక
దిక్కుతోచక దుఃఖిస్తు బక్కచిక్కిన బిడ్డలా
మౌనంగా రోదిస్తోంది...నా మాతృభాష..!

ఆకాశంలో తారల మధ్య
మసకబారిన తోకచుక్కలా...
వికసించని పూల మొగ్గలా...
వాడిపోయే కలువపువ్వులా...
రెక్కలున్నా ఎగరలేక
గూటిలో బంధియైన పక్షిలా...
మౌనంగా రోదిస్తోంది...నా మాతృభాష..!

అటు ఆంగ్లానికి ఇటు తెలుగుకు
మధ్యన నలిగి పోతూ
మత్స్యకారుని గాలానికి చిక్కి
గిలగిలలాడే చేపపిల్లలా...
వేటగాని వలలో పడి
విలవిలలాడే జింకపిల్లలా...
వేళకింత తిండిలేక
ఆకలికి అలమటించే అనాథలా...
మౌనంగా రోదిస్తోంది...నా మాతృభాష..!

తల్లి పాల తీపిని
తండ్రి ఆదరణను కోల్పోయి...
ప్రభుత్వాల నిర్లక్ష్యంతో...
పండితులెవరూ
ప్రశ్నించక...ప్రతిఘటించక...
దిక్కుతోచక గిరగిరా తిరుగుతూ ...
తెగిన గాలిపటంలా...
మౌనంగా రోదిస్తోంది...నా మాతృభాష..!

అందుకే
ఓ మేధావులారా...
ఓ సాహితీ మూర్తులారా...
ఓ సరస్వతీ పుత్రులారా...
ఈ తెలుగు భాషా దినోత్సవం



సందర్భంగా మీకిదే నా అక్షర సందేశం...
ఆంగ్లభాషా అంధకారాన్ని తొలిగించండి...
మరణించే మాతృభాషకు ఊపిరిలూదండి
ఆరని ఒలింపిక్ జ్యోతిగా వెలిగించండి...
మన తెలుగుతల్లి ఋణాన్ని తీర్చుకోండి..!



**రచన:**
**కవి రత్న**
**సాహిత్య ధీర**
**సహస్ర కవి భూషణ్**
**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్, హైదరాబాద్**

# అన్ని విద్యాసంస్థల్లో ముఖ గుర్తింపు హాజరు

**(మొదటిపేజీ తరువాయి)**

పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం అన్నీ ఒకే విభాగం కింద ఉండాలి. సమీకృత గురుకులాల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న తెలంగాణ విద్యా సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) నేతృత్వంలోనే ఇకపై నిర్మాణ పనులు కొనసాగాలి. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై సమకూర్చాలి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకోసం కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి. కంటైనర్లపైన సౌర పలకలు ఏర్పాటుచేసి, అవసరమైన విద్యుత్తు వినియోగించుకోవచ్చు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు గ్రీన్ ఛానల్‌లో జరగాలి. బిల్లుల సమర్పణ కూడా ఆన్‌లైన్‌లోనే సాగాలి. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద బడుల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు, 'మన ఊరుమన బడి' బకాయిలను వెంటనే విడుదల చేయాలి. రాష్ట్రంలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. అవసరమైతే కాంట్రాక్టు విధానంలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలి.

# సిగాచీ ఘటనపై నిపుణుల నివేదిక రావాల్సి ఉంది

**(మొదటిపేజీ తరువాయి)**

కమిటీని ఆదేశించామని, కమిటీ నుంచి నివేదిక అందాల్సి ఉందని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు చట్టప్రకారం బాధితులకు అండగా నిలబడుతున్నాయన్నారు. సిగాచీ ప్రమాద ఘటనపై సిట్‌తో దర్యాప్తు జరిపించాలని, బాధిత కుటుంబాలను ఆదుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ హైదరాబాద్‌కు చెందిన కె.బాబూరావు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై సీఎస్ కౌంటరు దాఖలు చేశారు. కలెక్టర్, కార్మికశాఖ, విపత్తుల నిర్వహణశాఖ, పోలీసులు, పరిశ్రమల శాఖల నుంచి వచ్చిన ప్రాథమిక నివేదికలను హైకోర్టుకు సమర్పించారు.

**నివేదికలోని వివరాలిలా...**

సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉన్నతస్థాయి కమిటీ ప్రాథమికంగా విచారణ జరిపింది. భద్రతా లోపాలు, నియంత్రణ చర్యలు లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో సంసిద్ధత లేకపోవడమే ప్రమాదానికి కారణమని విశ్లేషించింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే హైడ్రా నుంచి 265 మంది, ఎన్డీఆర్ఎఫ్ నుంచి 25 మంది, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల నుంచి 350 మంది, జిల్లా పోలీసులు 200 మంది, టీజీఎస్పీ ప్లాటూన్స్ 9 మంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

శిథిలాల నుంచి 77 నమూనాలు సేకరించి మృతదేహాల గుర్తింపు నిమిత్తం ఫోరెన్సిక్ పరీక్షలకు పంపాం. 43 మందికి మరణ ధ్రువీకరణ పత్రాలు అందించాం. మరో మూడు పెండింగ్‌లో ఉన్నాయి. అదృశ్యమైన 8 మంది మరణ ధ్రువీకరణ పత్రాల కోసం కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తక్షణ సాయం కింద బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున, పరిహారంగా రూ.50 వేల చొప్పున అందజేశాం. ముఖ్యమంత్రి, పరిశ్రమ యాజమాన్యం కలిపి మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించాయి. 'ఇందులో ఒక్కొక్కరికి రూ.25 లక్షలు అందజేశామని, తీవ్రంగా గాయపడినవారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.5 లక్షలు చెల్లించామని' కార్మికశాఖ నివేదిక సమర్పించింది. హాయక చర్యల ద్వారా 62 మందిని రక్షించినట్లు విపత్తుల నిర్వహణ విభాగం తెలిపింది. తమకు అనుమతులిచ్చే అధికారం తప్ప తనిఖీలు, నియంత్రణ అధికారం లేదని పరిశ్రమలశాఖ వెల్లడించింది. పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొనడంతోపాటు దర్యాప్తు చురుగ్గా చేపడుతున్నట్లు హోంశాఖ వెల్లడించింది. 192మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడం, పొరుగున ఉన్న పరిశ్రమల నుంచి సీసీటీవీ ఫుటేజీని సేకరించినట్టు పేర్కొంది.



# ఎటుచూసినా కన్నీటి జాడలే

హైదరాబాద్, నిజామాబాద్, ఈనాడు డిజిటల్, కామారెడ్డి: వర్షాలు తగ్గినా.. వరదలు శాంతించినా.. అవి మిగిల్చిన నష్టం జాడలు బాధితులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. శుక్రవారం వానల నుంచి ఉపశమనం లభించినా గ్రామాలు వరద తాలూకు భయం నుంచి బయటపడలేదు. మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరదతో శ్రీరామసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు పోటెత్తి నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. గ్రామీణ అంతర్గత రహదారులు తీవ్రంగా దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికితోడు భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలకు గండ్లు పడ్డాయి. వందలాది రోడ్లు కొట్టుకుపోయాయి. ప్రభుత్వ శాఖలు నష్టాన్ని అంచనా వేస్తూనే తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నాయి.

## చైనాతో బంధంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు.. ఆ మూడే ఆధారం!

**ఢిల్లీ, ఆగష్టు 29 :** భారత్, పొరుగు దేశమైన చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనాలు, పరస్పర సున్నితత్వం అనే మూడు కీలక సూత్రాల ఆధారంగా వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో ఈ బంధాన్ని బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం రెండు రోజుల జపాన్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, శుక్రవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు తాను జపాన్ నుంచి నేరుగా చైనాలోని టియాంజిన్ నగరానికి వెళ్లనున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అక్కడ జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. గత ఏడాది కజన్‌లో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలలో సానుకూల పురోగతి కనిపిస్తోందని మోదీ గుర్తు చేశారు. "భూమిపై అతిపెద్ద దేశాలు, పొరుగున ఉన్న భారత్‌చైనాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగితే, అది కేవలం ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచ శాంతి, శ్రేయస్సుకు కూడా ఎంతో మేలు చేస్తుంది," అని ప్రధాని అభిప్రాయపడ్డారు. బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచం ఏర్పడటానికి ఇది చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరతను ప్రస్తావిస్తూ, ఆర్థికంగా బలమైన దేశాలైన భారత్‌చైనా కలిసి పనిచేయడం ఎంతో అవసరమని మోదీ నొక్కిచెప్పారు. ప్రపంచ ఆర్థిక క్రమానికి స్థిరత్వం తీసుకురావడంలో ఇరు దేశాల భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత పర్యటనకు రావడం, ఇప్పుడు ప్రధాని మోదీ చైనాకు వెళ్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## రామసేతుకు జాతీయ హోదా: కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

**ఢిల్లీ, ఆగష్టు 29 :** రామసేతువును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కీలక ముందడుగు వేసింది. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నిర్దిష్ట సమయంలోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ స్వామి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) డైరెక్టర్, ఏఎస్ఐ తమిళనాడు ప్రాంతీయ డైరెక్టర్ ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. స్వామి తరఫున సీనియర్ న్యాయవాది విభా దత్తా మఖిజా, న్యాయవాది సత్య సబర్వాల్ వాదనలు వినిపించారు. రామసేతువును జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించే విషయంలో తన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రామసేతువుకు సంబంధించిన మతపరమైన, చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి, దాని పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఈ విషయంపై గత ఏడాది జనవరిలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వానికి మరిన్ని పత్రాలు సమర్పించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో, మే 13న మళ్లీ కేంద్ర సాంస్కృతిక మంత్రికి విజ్ఞప్తి చేసి, తాజాగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఏపీకి లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**అమరావతి, ఆగష్టు 29 :** ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగంలో ఏకంగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. విశాఖలో జరిగిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వ పాలసీల గురించి వివరించారు. ప్రస్తుతం దేశ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 35 శాతంగా ఉందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని అన్నారు. ఇప్పటికే 'ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన ఏపీ, దేశానికే 'ఆక్వా హబ్'గా కూడా నిలుస్తోందని ఆయన గుర్తుచేశారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు తమ ప్రభుత్వం 'ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0'ను అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. రూ. 200 కోట్లకు పైబడిన పెట్టుబడులను 'మెగా ప్రాజెక్టు'లుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. కేవలం పెట్టుబడులే కాకుండా, ఆవిష్కరణలకు కూడా పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో, ఆవిష్కరణల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందిస్తాయని భరోసా ఇచ్చారు. మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లను అందిపుచ్చుకుంటూ, ప్రపంచస్థాయి బ్రాండ్లను భారతదేశం నుంచి తయారు చేయాలన్నదే తమ ఆశయమని చంద్రబాబు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఏపీ చాప్టర్ ఏర్పాటు కానుండటం సంతోషకరమని అన్నారు.

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

**హైదరాబాద్, ఆగష్టు 29 :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అమీర్‌పేట, బంజారాహిల్స్, మణికొండ, పంజాగుట్ట, సికింద్రాబాద్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచింది. కార్యాలయాల్లో విధులు ముగించుకుని సాయంత్రం ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఫ్లైఓవర్ల కింద, బస్‌స్టాప్‌ల వద్ద తలదాచుకున్నారు.

**ప్రాజెక్టులకు జలకళ**

తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జోరువానలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 4,30,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 39 ప్రధాన గేట్ల ద్వారా 5,04,455 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 38 గేట్లు తెరిచి 6,79,019 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

**జపాన్, ఆగష్టు 29:** భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ... టోక్యోలో జరిగిన ఇండియాజపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే" అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు. సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది.

## ఫోన్ కాల్ లీక్.. ఊడిన థాయిలాండ్ ప్రధాని పదవి!

**థాయిలాండ్, ఆగష్టు 29 :** ఒక్క ఫోన్ కాల్ లీక్ ఒక దేశ ప్రధాని పదవిని కూల్చేసింది. థాయిలాండ్‌లో సంచలనం సృష్టించిన ఈ ఘటనలో, ఆ దేశ అతి పిన్న వయస్కురాలైన ప్రధాని పటోంగ్టార్న్ షినవత్రా తన పదవిని కోల్పోయారు. నైతిక ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించారన్న కారణంతో ఆమెను తక్షణమే పదవి నుంచి తొలగిస్తున్నట్లు థాయ్‌లాండ్ రాజ్యాంగ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ఏడాది క్రితమే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆమె, ఇప్పుడు అనూహ్యంగా పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఈ ఏడాది మే నెలలో థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు వివాదం తలెత్తింది. ఈ ఉద్రిక్తతల నడుమ ప్రధాని షినవత్రా కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణలో ఆమె థాయ్ సైన్యాధికారిపై విమర్శలు చేశారు. ఈ ఆడియో రికార్డింగ్ కాస్తా బయటకు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. సరిహద్దు వివాదం నెలకొన్న సమయంలో సొంత సైన్యాన్ని విమర్శించడం, పొరుగు దేశ నేతకు అనుకూలంగా మాట్లాడటం జాతీయ ప్రయోజనాలకు విఘాతం కలిగించడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## రేవంత్ రెడ్డిని కలిసి, కీలక విన్నపం చేసిన ఒవైసీ సోదరులు

**హైదరాబాద్, ఆగష్టు 29 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ సమావేశంలో, త్వరలో జరగనున్న మిలాద్‌ఉన్‌నబీ పర్వదినం ఏర్పాట్లకు సంబంధించి పలు కీలక విజ్ఞప్తులతో కూడిన వినతిపత్రాన్ని వారు సీఎంకు అందజేశారు. మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులతో కలిసి సీఎంను కలిసిన ఒవైసీ సోదరులు, పండుగ సందర్భంగా ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా, హైదరాబాద్‌లోని ప్రాచీన మసీదులు, దర్గాలను విద్యుద్దీపాలతో అలంకరించేందుకు అవసరమైన విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయాలని తమ వినతిపత్రంలో వారు విజ్ఞప్తి చేశారు.

# శ్రమ దోపిడీ ఎక్కువ.. వేతనాలు తక్కువ

* **కార్మికులకి కనీస 26000 వేలు వేతనం ఇవ్వాలి.**
* **సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి.**




ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియు జిల్లా కమిటీ ఆద్వర్యంలో ఆధ్వర్యంలో నేడు భారీ ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం అమలు కావడంలేదని, అతి దారుణంగా 12 వేల లోపే వేతనాలు ఇస్తున్నారని , 12 గంటల వరకు పని చేసే విధానాన్ని రద్దు చేయాలని, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద షాప్ ఎంప్లాయిస్ ,పెట్రోల్ బంక్ వర్కర్స్ ,గ్రామపంచాయతీ కార్మికులు, బేకరీ కార్మికులు, స్వచ్ఛమిత్ర కార్మికులు ,ఆటో డ్రైవర్లు, క్యాజువల్ కార్మకులు, వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు, వివిధ రంగాల్లో రోజువారి వేతనంతో పనిచేస్తున్న కార్మికులతో కలెక్టరేట్ వద్ద భారీ ధర్నాను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమనికి జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ అధ్యక్షతన వహించగా జిల్లా అధ్యక్షులు కె బ్రహ్మాచారి మాట్లాడుతూ వివిధ పని ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు శ్రమను దోపిడీ చేస్తూ అతి తక్కువ వేతనాలతో జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజుల నుండి వివిధ పని ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికుల వద్ద సమగ్ర సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో 12 గంటలు పని చేస్తున్నట్లు, సరైన వేతనం ఇవ్వకుండా శ్రమను దోచుకుంటున్నారని ,కనీస సౌకర్యాలు లేక కార్మికుల ఇబ్బందులు పడుతున్నారనీ, మహిళలకు రెస్టు రూమ్ లు , వాష్రూమ్స్ లేక సమస్యల లోగిల్లో నెట్టివేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకుండా రెండు నెలలు మూడు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారన్నారు. ఇలా వేతనాలు ఇవ్వడం వల్ల నెలవారి ఈ ఈ ఏం ఐ , అప్పులు ఎలా కట్టాలో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం లేక అనారోగ్య పాలవుతున్న కార్మికులకు సంబంధిత యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. నెలకు 30 రోజులు పని చేస్తున్నారని ప్రతి ఆదివారం వేతనంతో కూడిన సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. అట్టి యాజమాన్యాలపై సంబంధిత కార్మిక శాఖ అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా అతి తక్కువ జీతాలతో కార్మికుల శ్రమను దోచుకుంటున్న పద్ధతిపై ప్రభుత్వం కార్మికుల శాఖ అధికారులు దృష్టి పెట్టి అట్టి కార్మికుల పట్ల న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .ఉద్యోగ భద్రత లేకుండా నెలవారి జీతాలు సరిగా రాకుండా అరకొర వేతనాలతో కుటుంబం గడవాలంటే అప్పుల పాలు అవుతున్నారని ఆయన అన్నారు .సకాలంలో ఆ అప్పులు తీర్చలేక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .ఈ హత్యలకు కారణం ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా శ్రమకు గురవుతున్న కార్మికులను రక్షించే బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. కార్మికుల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జీలకర్ర పద్మ, జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య , జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ ,తాళ్లపల్లి కృష్ణ, నిమ్మల మధు, లిక్కి బాలరాజు తో పాటు వివిధ రంగాల కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

* **జిల్లా లేబర్ ఆఫీసర్ శర్ఫుద్దిన్ వివరణ.**

వారం రోజుల నుండి సర్వే చేసిన వినతి పత్రాలను జిల్లా కార్మిక శాఖ అధికారికి సిఐటియు నాయకులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారి షర్ఫుద్దీన్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. సంబంధిత యాజమాన్యాలకు సౌకర్యాల పట్ల శాఖ తరపు నుండి నోటీసులు అందజేస్తామని తెలిపారు.

## దేశభాషలందు తెలుగు లెస్స

* **త్రినిటీలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం**
* **ఉజ్జిని మంజుల**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: దేశభాషలందు తెలుగు లెస్స అని త్రినిటీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, డైరెక్టర్ ఉజ్జిని మంజుల అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం త్రినిటి పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు తేనె కన్నా తీయనైనది తెలుగు భాష అంటూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషకు ప్రాధాన్యతనిస్తూ, సుస్పష్టంగా తెలుగును నేర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి పై ఉందన్నారు. అనంతరం త్రినిటీ పాఠశాల చైర్మన్ కె.వి.బీ కృష్ణారావు తెలుగు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో పూజలందుకున్న లంబోదరుడు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని న్యూ శ్రీనివాస కాలనీ లోనీ వివిధ వినాయకుడిని మండపాలలో ఏర్పాటు చేసిన గణనాథుడికిశుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మన్నే మహేష్ యాదవ్ , కమిటీ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



జీడిమెట్ల, (ప్రజాస్పూర్తి) : వినాయక చవితి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో గల మూడు గుళ్ల దేవస్థానం కమిటీ వారు, శ్రీ రామాంజనేయ యువజన సంఘం వారు, రాజీవ్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ముఖ్య అతిథిగా యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్ గౌడ్ విచ్చేసి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క ప్రకాష్, కోశాధికారి పోతరాజ్ మహేందర్ కుమార్, మూడుగుళ్ల దేవస్థాన కమిటీ కార్యదర్శి కవాడి జైపాల్ రెడ్డి, శ్రీ రామాంజనేయ యువజన సంఘం సభ్యులు రత్నం కిరణ్ కుమార్ గౌడ్, ఉలిపి వెంకటేష్ కురుమ , జిట్టా రామేశ్వర్ రెడ్డి, కుంట వేణు ముదిరాజ్, కుంట అజయ్ ముదిరాజ్, ఠాగూర్ విజయేందర్ సింగ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలి

* **పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ**

ప్రజాస్పూర్తి, ఇల్లందు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయిలేదని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు. శుక్రవారం పిడిఎస్యూ విద్యార్థి పోరుబాట యాత్ర ఇల్లెందుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలో విద్యార్థులు స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో గడిచిన పది సంవత్సరాల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యను విధ్వంసం చేశారని అందుకే తెలంగాణ సమాజమంతా ఏకమై కెసిఆర్ ని గద్దె దించారని కెసిఆర్ పై ఉన్న వ్యతిరేకతను మూటగట్టుకొని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి విద్యారంగాన్ని అభివృద్ధి చేయకుండా కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తూ ప్రభుత్వ విద్యను మరింత సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని రెండు సంవత్సరాలు గడిచిన నేటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వంగా ప్రఖ్యాతి తెచ్చుకుందని వారు అన్నారు. స్కూల్ స్థాయి నుండి యూనివర్సిటీల స్థాయి వరకు ప్రభుత్వ విద్యను అస్తవ్యస్తంగా మారుస్తూ దిశా నిర్దేశం లేకుండా గందరగోళానికి గురిచేస్తూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వ విద్యను పాతరేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యార్థులకు స్కాలర్షిప్,రియంబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. పిడిఎస్యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేతలు మునిగెలా శివ ప్రశాంత్,బి. సాయికుమార్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన షెడ్యూల్ కులాల వసతి గృహాలు అపరిశుభ్రంగా ఉండి మురికివాడల్లా మారిపోయాయని, విద్యార్థులకు కాస్మోటిక్ డైట్ చార్జీలు ఇవ్వకుండా కాలం యల్ల తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లకు కనీసం డోర్లు కూడా లేవని, రక్షిత మంచినీరు విద్యార్థులకు అందించే పరిస్థితి లేదని, వర్షాకాలంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న క్రమంలో కనీసం మెడికల్ క్యాంపులు కూడా నిర్వహించలేని పరిస్థితుల్లో ఐటీడీఏ విద్యాశాఖ ఉందని అన్నారు. విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సూచించిన అంశాలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి మెనూ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పెండింగ్ చార్జీలు విడుదల చేయాలని, ప్రైవేట్ పాఠశాలలలో ఫీజు నియంత్రణ చట్టం చేయాలని ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పి డి యస్ యూ విద్యార్థి పోరుబాటయాత్ర కు సంఘీభావంగా టి యు సి ఐ జిల్లా కార్యదర్శి యాకూబ్ శావలి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల ప్రణాళికలో రాసుకున్న బద్ధంగానైన కనీసం 15% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు రామ్ చరణ్, అబ్దుల్ గని, విష్ణువర్ధన్,జార్జ్, సంధ్యా,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## త్రైకండో లో మెడల్స్ సాదించిన విద్యార్థులు

* **త్వైకండో కోచ్,మాస్టర్స్ షమీఉద్దిన్,రమేష్**




ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మేజర్ ద్యానచంద్ జయంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో జిల్లా యువజన,క్రీడా శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా తైక్వాండో క్రీడా పోటీల్లో కొత్తగూడెం తైక్వాండో క్రీడాకారులు అండర్ 9 గర్ల్స్ లో హఫ్సా ఫాతిమా బంగారు,పి.అధితి ప్రియ రజత,డి.భవంతి కాంస్య,అండర్ 10 లో కె.సహస్ర బంగారు,ఎల్ నాగ జేశ్విత రజత,పుండరీకాక్ష కాంస్య,అండర్ 11 జి.మన్విత బంగారు,జె ప్రశాంతి రజత,ఎస్.కె సైమా కాంస్య పతకాలు సాధించినట్లు,పథకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మెడల్స్ ప్రధానం చేసి క్రీడాకారులను అభినందించి,భవిష్యత్తులో ఇంకా సాధన చేసి రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి జిల్లాకు పేరు,ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించినట్లు తైక్వాండో కోచ్ లు ఎం.డీ. షమీఉద్దిన్,రమేష్ లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్,బాక్సింగ్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ యెర్రా కామేష్,యాకూబ్ మాస్టర్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన మెజిస్ట్రేట్ దుర్గా భవాని

* **భద్రాచలం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గా దుర్గా భవాని**



ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం :తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు హైదరాబాద్ పంజాగుట్టలోని శ్రీనగర్ కాలనీకి చెందిన దుర్గా భవాని భద్రాచలం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గా నియమితులయ్యారు. శుక్రవారం ఆమె భద్రాచలం ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివ నాయక్ నుండి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ దుర్గా భవాని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ను జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## త్రినిటీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ లోని త్రినిటీ పాఠశాలలో భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కె.వి.బి కృష్ణారావు, ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఉజ్జిని మంజులలు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి మల్లఖంబ్, కబడ్డీ, తైక్వాండో, ఖోఖో, కరాటే, వాలీబాల్ ,క్రికెట్ క్రీడల్లో పాల్గొన్న త్రినిటి పాఠశాల విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల చైర్మన్ కె. వి. బి కృష్ణారావు మాట్లాడుతూ ధ్యాన్ చంద్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశ జాతీయ క్రీడ హాకీ ఒలంపిక్స్ లో భారత జెండాని ఎగరవేశారని విద్యార్థులకు తెలిపారు. క్రీడాకారులు అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని, క్రీడల్లో మరింత రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, వెంకటేష్, గోపాల్, నరేష్, చందర్, గోవింద్, అరుణ, స్వరూప, స్వాతి, ఇందు, మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో పూల కుండీలు, మొక్కల పంపిణీ




ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో పర్యావరణ హిత చర్యలలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో 30 పూల కుండీలు, క్రోటన్ మొక్కలు పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది.కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస్, అధ్యాపకుల సమక్షంలో మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్పర్సన్ లయన్, భద్రాచలం ఆర్టిఏ అధికారి సంఘం వెంకట పుల్లయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస్ మాట్లాడుతూ, “విద్యార్థుల్లో పర్యావరణంపై చైతన్యం పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. కళాశాల పరిసరాలు పచ్చదనంతో కళకళలాడేలా మొక్కలను సంరక్షించుకోవాలి” అని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ బొక్క శ్రీనివాస్ మాట్లాడుతూ, సామాజిక సేవలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు తమ క్లబ్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. పచ్చదనమే భవిష్యత్ తరాలకు బహుమతి అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటి, వాటిని పరిరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ నమిళ్ల నరేష్, ట్రెజరర్ పగడాల నాగేశ్వరరావు, క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ లయన్ గబ్బట రాజయ్య, విజయలక్ష్మి, ఎంజేఎఫ్ లయన్ మండల రాజేశ్వరరావు, టి. శరత్ బాబు పాల్గొన్నారు. అలాగే అధ్యాపకులు, విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

# త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు అండగా ఉంటా

- **నన్ను నమ్మండి, సీఎం రేవంత్ రెడ్డి తో మరోసారి మాట్లాడుతా**
- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు తాను అండగా నిలబడతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భరోసా కల్పించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసి, తమను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను మార్చారని ఆరోపించారు. ఆనాటి రాజకీయ నాయకులు తప్పులు చేసి, తమకు ఏమీ తెలియదు అన్నట్లుగా మీతో కలిసి ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం దివిస్ తో కుమ్మక్కైందని ఆరోపించారు. మీకు నాయ్యం జరగాలనేదే తన కోరిక, మంచి ధర ఇపించే ప్రయత్నం చేస్తానన్నారు. భూముల సేకరణ ప్రాసెస్ ఎంతవరకు వచ్చిందని ఫోన్ లో అధికారులను అడిగి తెలుసుకొని, కొన్ని రోజుల వరకు తాత్కాలికంగా ప్రాసెస్ ను ఆపండని అధికారులకు సూచించారు. మరొక సారి అలైన్ మెంట్ గురించి అధికారులుతో చర్చిస్తానని, రేపు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి, మీ సమస్యను తెలియజేస్తానని బాధితులకు హామీ



ఇచ్చారు. ఒక పార్టీకి కాదు, నేను మునుగోడు ప్రజలందరికి ఎమ్మెల్యేనని, నేను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల బాధలు తనకు తెలుసన్నారు. తనపై నమ్మకం ఉంచండని, మీకు న్యాయం జరిగే వరకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, నాయకులు వెన్ రెడ్డి రాజు, చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, వెలగ రాజశేఖర్ రెడ్డి, పబ్బు రాజు గౌడ్, ఎండి హన్ను, బత్తుల విప్లవ్ కుమార్, మొగుదాల రమేష్, సందగళ్ళ సతీష్, బోయ దేవేందర్, సుర్వి నరసింహ, షేక్ జానీ, ఆవుల యేసు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యరంగంలో కొత్తగూడెం జిల్లా కేంద్రం మరింత బలపడాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణం వైద్యరంగంలో మరింత బలోపేతం కావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని ఓల్డ్ డిపో ఏరియాలో నూతనంగా ఏర్పాటుచేసిన 'శ్రీ ఉషా మల్టీ స్పెసిలిటీ అండ్ డయాలసిస్ ఆస్పత్రిని' శుక్రవారం అయన ప్రారంభించి ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైద్యశాల వివిధ జబ్బులు, ప్రాణాంతక వ్యాధులు, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేదవర్గాల ఆధునిక వైద్య సౌకర్యంలో అందుబాటులోకి వస్తుండటం శుభపరిణామమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు కేవలం లాభాల కోసం కాకుండా ప్రజాసేవా భావంతో ముందుకు రావాలని, బలహీన వర్గాల ప్రజలకు తక్కువ ధరల్లో అవసరమైతే ఉచిత సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యసేవలు అందరికీ హక్కుగా మారేలా ప్రభుత్వము కూడా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించి, పేదలకు సహాయం అందించాలి అని డిమాండ్ చేశారు. ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, విజయకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ జాబీతాలో పేర్లు నమోదు చేసుకోవాలి

*** బిఆర్ఎస్ పార్టీ నాయకులు కర్రె చంద్రశేఖర్**



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: మల్లాపురం గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల ఓటరు జాబితా గ్రామ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ పక్షాన అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు మల్లాపురం గ్రామపంచాయతీ లో 12 వార్డులలో పార్టీ బలోపేతం కోసం ఇన్చార్జిలను నియమించుకొని గ్రామ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కార్యకర్తలతో వార్డుల వారీగా అవగాహన సదస్సు కార్యక్రమాలు గ్రామంలో నివసిస్తూ 18 సంవత్సరాలు నిండి ఉండి ఓటు హక్కు లేనివారు ఎవరైనా ఓటు నమోదు చేసుకోగలరని గ్రామ అభివృద్ధిలో భాగస్వాములకై ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్న ఎన్నికలలో ఓటు హక్కు ఉపయోగించు కోవటం కోసం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కర్రె చంద్రశేఖర్, బి ఆర్ ఎస్వి మండల అధ్యక్షులు ఒగ్గు మల్లేష్, ఎండి ఇమామ్, ఓరిగంటి శ్రీధర్ ఆచారి, కర్రె కరుణాకర్, ఒగ్గు శేఖర్, రెబల్ యూత్ మెంబర్ కర్రె మధుపండు కర్రే లింగస్వామి, దుద్దురు హర్షవర్ధన్ గౌడ్, కర్రె చింటూ, శ్రీధర్ శ్రీనాథ్, రాజు, తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన చలమల్ల కృష్ణారెడ్డి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బత్తుల శ్రీహరి కుమారుడు శ్రవణ్ కుమార్ ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బత్తుల శ్రీహరిని శుక్రవారం పరామర్శించారు. శ్రవణ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. మనోధైర్యంతో ఉండాలని శ్రీహరికి సర్ది చెప్పారు.





## గణనాధునికి కి ప్రత్యేక పూజలు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి పనిలో విఘ్నాలను తొలగించి.. విజయం సిద్ధించేలా ఆశీర్వదించే స్వామి విఘ్నేశ్వర స్వామి అని ది ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు దోనూరు రాంరెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులో శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ప్రతిష్టించిన వినాయక విగ్రహానికి పాత్రికేయులతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దోనూరు రాంరెడ్డి మాట్లాడుతూ భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం గ్రామంలో వినాయక స్వామికి స్థానిక ఆకాష్ ఫౌండేషన్ చైర్మన్ దుబ్బాక ఆకాష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం వర్కర్లందర్నీ పర్మినెంట్ చేయాలి

*** ఐ ఎఫ్ టి యు జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్,స్కీమ్ వర్కర్లందర్నీ పర్మినెంట్ చేయాలని,కనీస వేతనాలు అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) జాతీయ ఉపాధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు(ఎస్ వి)డిమాండ్ చేశారు.శుక్రవారం ఇల్లెందు ఐఎఫ్టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సింగరేణి,ఎన్టీపీసీ,ఎఫ్ సి ఐ,ఈసీఐఎల్,బిడిఎల్, బిహెచ్ఇఎల్, గ్రామపంచాయతీ, మున్సిపల్,ప్రభుత్వ హాస్పిటల్స్ ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ కార్మికులతో పాటు స్కీం వర్కర్స్ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస వేతనాలు లేక,ఉద్యోగ భద్రత లేక పని గంటల భారంతో,పని స్థలాల్లో రక్షణ లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్లలో గత పది,పదిహేను సంవత్సరాలుగా కనీస వేతనాల జీవోలు విడుదల కాలేదని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. రాష్ట్రంలో వేలాది పరిశ్రమలు అత్యంత ప్రమాదకర స్థితిలో నిర్వహిస్తుండడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 7న హైదరాబాద్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సదస్సుకు కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు ఇల్లెందు ఏరియా కమిటీ అధ్యక్షులు రావూరి ఉపేందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కొక్కు సారంగపాణి,జె. సీతారామయ్య,జిల్లా సహాయ కార్యదర్శిఎండి. రాసుద్దిన్,జిల్లా ఉపాధ్యక్షులు డి.ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి డి. మోహన్ రావు,టియుఎం చారి,మురళి,డి. నూనేశ్వరరావు,పల్లి సుధాకర్,ఏ. మహేందర్,సింగారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక్ నగర్ 137 డివిజన్ లో పెండింగ్ వర్క్స్ పూర్తి చేయాలి

*** సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ రవి కిరణ్ కి వినతి**




మల్కాజ్గిరి , ప్రజాస్ఫూర్తి : వినాయక్ నగర్ 137 డివిజన్ లో పెండింగ్ వర్క్స్ పూర్తి చేయాలని శుక్రవారం సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ రవి కిరణ్ ని కార్పోరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సంతోషిమా నగర్ చౌరస్తా నుండి చంద్రగిరి కాలనీ వరకు కొత్త సీసీ రోడ్, కాకతీయ నగర్ ఐపీహెచ్ఎస్ స్కూల్ నుండి గౌరీ శంకర్ అపార్మెంట్స్ వరకు, వినాయక నగర్ సబ్ లైన్స్, సూర్య నగర్ బొక్స్ డ్రైన్, ఆనంద్ బాగ్ కమ్యూనిటీ హాల్, ఆనంద్ బాగ్ బ్రిడ్జి పెయింటింగ్, వెస్ట్ కాకతీయ నగర్, బండ చెరువు లో సిల్ట్ తీయడం, వాజ్ పేయి నగర్ కూమ్యూనిటీ హాల్, వినాయక్ నగర్ కమ్యూనిటీ హాల్ కోసం రిప్రెసెంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంగేష్ కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షుడు ఓం ప్రకాష్, జ్యోతిర్మయి ,గోపాల్, సాయిసురేష్, ప్రవీణ్, పాల్గొన్నారు

## ఘనంగా పూజలందుకున్న వినాయకుడు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి హరితవనం కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడికి అఖిల భారత ధర్మ జాగరణ సంయోజక్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ ఆలె శ్యామ్ కుమార్ జీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికార్యదర్శులు రమేశ్, మహిపాల్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ గిరివర్ధన్ రెడ్డి, బాచుపల్లి, నిజాంపేట కన్వీనర్లు సుబ్బారావు, చక్రధర్ లతో కలిసి వివిధ వినాయక మండపాల సందర్శనలో భాగంగా, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేశ్ మండపాన్ని శ్యామ్ జీ సందర్శించి, వినాయకుణ్ణి దర్శించుకున్నారు ఈ సందర్భంగా పురోహితులు వేదాశీర్వచనం అందించగా, విజయలక్ష్మి సుబ్బారావు దంపతులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. అత్యంత వైభవోపేతంగా సాంప్రదాయబద్ధంగా ప్రతిరోజు హోమాలతో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ వారిని శ్యామ్ జీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రామ్ ప్రసాద్ జీ, డాక్టర్ ఎం.ఎస్, రాజు, కొండమ నాయుడు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## టీవీఆర్ మోడల్ హై స్కూల్ లో ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు





జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో గల టీవీఆర్ మోడల్ హై స్కూల్, ఎస్ఆర్ నాయక్ నగర్లో గల సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్ లో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ " జన్మదినం సందర్భంగా శుక్రవారం టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలకు టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ కీర్తి రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాబినెట్ , ప్రిపెక్ట్ టీం , 8వ తరగతి, 9వ తరగతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేషనల్ స్పోర్ట్స్ డే " శుభాకాంక్షలు తెలియజేశారు. స్పోర్ట్స్ మెన్ ప్రత్యేకతను చరిత్రలో నిలిచిపోయిన స్పోర్ట్స్ & అథ్లెటిక్ విభాగాలలో భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన వారిని స్మరిస్తూ నినాదాలతో వాడవాడలు హోరెత్తాయి. ప్రముఖ హాకీ మాంత్రికుడు గా పేరొందిన "మేజర్ ధ్యాన్ చంద్ " జన్మదినం రోజున "నేషనల్ స్పోర్ట్స్ డే జరుపుకోవాలని నాటి గవర్నమెంటు ఇచ్చిన ఆదేశానుసారం నాటి నుండి అనావాయితిగా జరుపుకుంటున్నామన్నారు. భారతదేశానికి మూడుసార్లు బంగారు పథకాలను సాధించిన ఘనత మన హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ అని అన్నారు. భారత దేశ ఔన్నత్యాన్ని చాటే గొప్ప వారి గురించి నలుగురికి తెలియచేలా చేయడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. అందులో భాగంగా నినాదాలు ఇస్తూ క్రమశిక్షణతో ర్యాలీ నిర్వహించి పాఠశాలల్లో క్రీడాజ్యోతిని వెలిగించి " స్పోర్ట్స్ ఫ్లాగ్ "ఎగురవేశారు .ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ స్పోర్ట్స్ &. అథ్లెటిక్ లలో దేశ గొప్పతనాన్ని నలుదిశలా చాటే మేజర్ ధ్యాన్ చంద్ లాంటి గొప్ప క్రీడాకారులను స్మరించుకోవడం చరిత్రను తెలుసుకోవడం యువతకు విద్యార్థిని విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అవ్వాలని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం

*** పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువు (ధరణి నగర్) నుండి ప్రేమ్ సరోవహర్ వరకు రూ.8 కోట్ల 76 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే నాల విస్తరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న ఆర్సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను, ఆర్సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం , నాల విస్తరణ నిర్మాణం పనులకు ఆయన తో పాటు కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ ,ఎస్ఎన్డిపి విభాగం అధికారులు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఎస్ఎన్డిపి ఫేస్ 2 లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79 కోట్ల 58 లక్షల రూపాయలతో అంచనా వ్యయం తో నాలల విస్తరణ పనులు చేపట్టడం తో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్య కు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దానిలో భాగంగా పరికి చెరువు (ధరణి నగర్) నుండి ప్రేమ్ సరోవహర్ వరకు రూ.8 కోట్ల 76 లక్షల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే నాల విస్తరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తీరనుంది అని,ధరణి నగర్ కాలనీ నుండి ప్రేమ్ సరోవహర్ వరకు నాల కు ఇరువైపుల ప్రహరీ గోడ నిర్మించడం జరుగుతుంది అని , తర్వాత ప్రేమ్ సరోవహర్ నుండి ఆస్బె స్టాస్ కాలనీ వరకు నాల కు ఇరువైపుల ప్రహరి గోడ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. నాల విస్తరణ వలన ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం అని,నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలన్నారు. నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలని ,యుద్దప్రాతిపదికన పనులు ప్రారంభించాలని,అధికారులకు ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు.నాలల విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని , పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, స్థానిక కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తారమ్మ ఆలయం వద్ద బేబీ పాండ్ ను పరిశీలించిన కార్పొరేటర్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్లో వినాయక నిమజ్జనం కోసం చిత్తారమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన బేబీ పాండ్ ను జిహెచ్ఎంసి అధికారులు ఏఈ ప్రసన్న తో కలిసి వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఈ బేబీ పాండులో మూడు అడుగుల లోపు ఉన్న విగ్రహాలను నిమజ్జనం చేయుటకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినందున, ప్రజలందరూ దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కొలనుపాక మేరు కుల మటంలో ప్రత్యేక పూజలు



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి: ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ జటగిరి శంకర దాసమయ్య స్వామి వారి మేరు మఠం ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పిఆర్వో ఆదిమూలం సురేష్ గారు. ఈ సంధర్బంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలంతా ,మేరు కుల బంధువులాంత సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆదిమూలం వీరస్వామి , ది కొండ వెంకటేశం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్య వద్ద అన్నదానం




(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి) : నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు రమేష్ నాయి ఆధ్వర్యంలో వినాయక అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పైప్ లైన్ రోడ్ లోని ఏర్పాటుచేసిన గణపయ్యకు పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. పూజా కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, సీనియర్ జర్నలిస్టులు నాగరాజు, నవీన్ రెడ్డి, సాయిబాబా, మహేందర్ నాయక్, కైలాష్, రమణ, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృశ్య ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి కలెక్టర్ ఓటరు జాబితా తయారీ, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల వద్ద జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,024 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,033, మహిళలు 3,43,967 మంది కాగా 24 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు మండల స్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఆగస్టు 30 సాయంత్రం లోపు ఓటర్ల జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా మండల కార్యాలయాల్లో తెలియజేయాలని ఆయన తెలిపారు. అభ్యంతరాల సవరణ అనంతరం సెప్టెంబర్ రెండున తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇది ఓటర్ల జాబితా వార్డుల ప్రకారం ప్రదర్శించబడతాయని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాలలో కల్పించవలసిన మౌలిక వసతులు లేదా సమస్యల పరిష్కారాలను తమ దృష్టికి తేవడం ద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్, బాల ప్రసాద్, భారతీయ రాష్ట్ర సమితి రేగా కాంతారావు, సిపిఐ ఎస్ శ్రీనివాస్, సిపిఎం ఏ సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ నరేందర్, నోములబాలు, ఆమ్ ఆద్మీ పార్టీ ఏ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న పింఛను ద్రోహ దినంను విజయవంతం చేయాలి



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : సెప్టెంబర్ 1న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించనున్న పింఛను ద్రోహ దినంను విజయవంతం చేయాలని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బి. రవి ప్రకాష్, సెక్రటరీ జనరల్ జి. వినోద్ లు పిలుపునిచ్చారు. గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు & పెన్షనర్లు జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు , ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అదే రోజున మధ్యాహ్నం 3:00 గంటలకు హైదరాబాద్‌లోని వి.ఎస్.టి. రోడ్డులో ఉన్న ఆర్టీసీ కళాభవన్ (కళ్యాణ మండపం), భాగ్‌లింగంపల్లిలో *"పాత పెన్షన్ సాధన పోరాట సభ"*ను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముందు టీఈ జేఏసీ పోస్టర్‌ను విడుదల చేసి, అనంతరం అదనపు కలెక్టర్ (రెవిన్యూ) విజయేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, సెప్టెంబర్ 1, 2025న జరగబోయే పింఛను ద్రోహ దినం , పాత పెన్షన్ సాధన పోరాట సభకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సమావేశంలో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఈ జేఏసీ చైర్మన్ & టీఎన్జీఓ అధ్యక్షుడు రవి ప్రకాశ్, టీఈజేఏసీ ప్రధాన కార్యదర్శి & టీజీవో అధ్యక్షుడు జి. వినోద్, టీజీవో కార్యదర్శి కురుమూతి, ట్రెసా అధ్యక్షుడు సుధాకర్, టీజీవో ప్రచార కార్యదర్శి రవీందర్, టీఎన్జీఓఎస్ జిల్లా కార్యదర్శి బి. భరత్ కుమార్, టీఎన్జీఓఎస్ కోశాధికారి శేష సాయి గిరికాంత్, ఉపాధ్యక్షుడు రవిచంద్రన్, అశ్విని, కలెక్టర్ కార్యాలయ యూనిట్ అధ్యక్షకార్యదర్శులు కార్తిక్ , కిశోర్, కోశాధికారి లింగాల అక్షయ్, మెడ్చల్ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, మల్కాజ్‌గిరి యూనిట్ కార్యదర్శి అరుణ, కోశాధికారి సత్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుడికి పూజలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నిజాంపేట్ నగర పాలక సంస్థ కార్యాలయంలో గల వినాయకుడికి మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచశీల స్కూల్ లో ఘనంగా తెలుగు బాషా దినోత్సవ వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో శుక్రవారం తెలుగు బాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి, తెలుగు తల్లి వేషాధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కార్పొండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు బాషా గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అమ్మలాంటి తెలుగు భాషను ఎవరు మరువకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు అండగా ఉంటా

- **నన్ను నమ్మండి, సీఎం రేవంత్ రెడ్డి తో మరోసారి మాట్లాడుతా**
- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు తాను అండగా నిలబడతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భరోసా కల్పించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కలిసి, తమను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను మార్చారని ఆరోపించారు. ఆనాటి రాజకీయ నాయకులు తప్పులు చేసి, తమకు ఏమీ తెలియదు అన్నట్లుగా మీతో కలిసి ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం దివిస్ తో కుమ్మక్కైందని ఆరోపించారు. మీకు నాయ్యం జరగాలనేదే తన కోరిక, మంచి ధర ఇపించే ప్రయత్నం చేస్తానన్నారు. భూముల సేకరణ ప్రాసెస్ ఎంతవరకు వచ్చిందని ఫోన్ లో అధికారులను అడిగి తెలుసుకొని, కొన్ని రోజుల వరకు తాత్కాలికంగా ప్రాసెస్ ను ఆపండని అధికారులకు సూచించారు. మరొక సారి అలైన్ మెంట్ గురించి అధికారులుతో చర్చిస్తానని, రేపు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి, మీ సమస్యను తెలియజేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. ఒక పార్టీకి కాదు, నేను మునుగోడు ప్రజలందరికి ఎమ్మెల్యేనని, నేను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల బాధలు తనకు తెలుసన్నారు. తనపై నమ్మకం ఉంచండని, మీకు న్యాయం జరిగే వరకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## డాక్టర్ రాంప్రసాద్ చేసిన సేవలు మరువలేనివి

- **పలువురు మృతుల కుటుంబాలకు పరామర్శ**
- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు శికలంమెట్ల రామ్ ప్రసాద్ ఆకస్మికంగా మరణించడం చాలా బాధ కలిగించిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని ఆయన నివాసానికి శుక్రవారం ఎమ్మెల్యే వెళ్లి డాక్టర్ రామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రాంప్రసాద్ ఈ ప్రాంత ప్రజలకు సేవ భావం మెరుగైన వైద్య సేవలు అందించి అందరి అభిమానాన్ని చూరాగొన్నారన్నారు.

**బత్తుల శ్రావణ్ కుటుంబాన్ని..**

చౌటుప్పల్ మండలంలోని ధర్మోజీగూడెం గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ బత్తుల శ్రీహరి కుమారుడు బత్తుల శ్రవణ్ ఇటీవల అకాల మరణం చెందగా గ్రామంలోని వారి నివాసానికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వెళ్లి బత్తుల శ్రవణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండలంలోని ఎల్లం బావి గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బడుగు అశోక్ తండ్రి బడుగు జనార్ధన్ మృతి చెందగా గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి బడుగు జనార్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. చౌటుప్పల్ పట్టణానికి చెందిన రాజగోపాల్ రెడ్డి అభిమాని, యువజన కాంగ్రెస్ నాయకులు మాలిగ మల్లేష్ నానమ్మ మాలిగ ముత్తమ్మ మరణించగా పట్టణం లోని వారి నివాసానికి వెళ్లి ముత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. చౌటుప్పల్ పట్టణానికి చెందిన మరో కాంగ్రెస్ నాయకులు చెరుకు లింగస్వామి తండ్రి చెరుకు యాదయ్య ఇటీవల అనారోగ్యానికి గురికాగా వారి నివాసానికి వెళ్లి యాదయ్య ను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పబ్బు రాజు గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలగ రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, నాయకులు మొగుదాల రమేష్, బత్తుల విప్లవ్, సందగళ్ళ సతీష్, బోయ దేవేందర్, సుర్వి నరసింహ, ఎండి హన్ను, బొంగు జంగయ్య, దోనూరు జైపాల్ రెడ్డి, లింగస్వామి తదితరులు ఉన్నారు.

# గుడ్ల సరఫరాపై దాఖలైన పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు గుడ్ల సరఫరా కోసం జారీ చేసిన టెండర్ల ప్రక్రియను కొనసాగించవచ్చని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సరైన ఆధారాల్లేకుండా టెండర్ల ప్రక్రియను అడ్డుకోవడానికి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ రూ.లక్ష జరిమానా విధించింది. సెప్టెంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు ఎంఏ ఫౌల్ట్రీ అండ్ ఫీడ్‌కు టెండరు ఖరారు చేయడాన్ని సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన సిరిఫామ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ టెండరు షరతులను అమలు చేయని కంపెనీకి టెండరు అప్పగించారన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వేసిన గుడ్డు ధర ఆధారంగా టెండర్ నిర్ణయించామని, టెండర్ పరిశీలన సందర్భంగా ప్రతివాది కంపెనీకి సంబంధించి కొన్ని పత్రాలు లేవని,



తరువాత సమర్పించారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి సాంకేతిక కారణాలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వానికి ఆదా చేసే టెండరును తిరస్కరించాలని ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు. తక్కువ ధరకు సరఫరా చేసే సంస్థను ఎంచుకునే హక్కు టెండరుదారుకు ఉంటుందన్నారు. టెండరు దాఖలు సమయంలో పత్రాలు సమర్పించలేదన్న కారణం సరికాదని, తరువాత తనిఖీ సందర్భంగా మిగిలిన పత్రాలు సమర్పించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి నష్టం ఉందని ఆధారాలు సమర్పిస్తే దానిపై స్టే ఇస్తామన్నారు. ప్రస్తుత టెండరులో జోక్యం చేసుకోలేమని, టెండరును అడ్డుకోవడానికి చేసిన ప్రయత్నాలపై రూ.లక్ష జరిమానా విధిస్తూ ఉన్నత న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

## ప్రజల గోడును గాలికొదిలేసి.. విలాసవంతమైన ప్రాజెక్టులపై సమీక్షలా? కేటీఆర్



హైదరాబాద్: భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం విలాసవంతమైన ప్రాజెక్టులపై సమీక్షలు చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆక్షేపించారు. ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. భారీ వర్షాలతో ప్రజాజీవనం స్తంభించిందని, పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందన్నారు. ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ''సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కష్టాలు పట్టించుకోవడం లేదు. విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. రూ.3.5లక్షల కోట్లతో 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1.5లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ, రూ.225 కోట్లతో హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్‌రెడ్డి అండ్ కో దృష్టి పెట్టింది. ఇది ప్రజాపాలన కాదు''అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## అసెంబ్లీలో కాళేశ్వరంపై
### చర్చ జరిగితే వారి బండారం బయటపడుతుంది: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: ''అసెంబ్లీలో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి అడుగుతోంది. ఆనాడు అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ శాసనసభా పక్షం అడిగితే పట్టించుకోలేదు''అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీసీ ఘోష్ కమిషన్‌పై అసెంబ్లీలో చర్చ జరిగితే వారి బండారం బయటపడుతుందని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారని అన్నారు. ''కాళేశ్వరానికి కర్త, కర్మ, క్రియ తానేనని కేసీఆర్ చెప్పుకొన్నారు. అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి గొప్పలకు పోయారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ హయాంలో కట్టారు.. వారి హయాంలోనే



కూలిపోయింది. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రజల ముందు ఉంచడానికి అసెంబ్లీలో చర్చకు పెడుతున్నాం. ఆ నివేదికను ఆపాలని భారత రాష్ట్ర సమితి హైకోర్టుకు వెళ్లి భంగపడింది. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోవడంతో తెలంగాణ ప్రతిష్ఠ గంగలో కలిసిపోయింది. మామ, అల్లుడు నీటిపారుదలశాఖ మంత్రిగా ఉండి ఏం సాధించారు? తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే ప్రజలు పట్టించుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన ఇంజినీర్ల వద్ద ఏసీబీ రూ.వందల కోట్లు పట్టుకుంది. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా మా ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది. భారత రాష్ట్ర సమితి అసెంబ్లీలో అన్ని విషయాలు చెప్పుకోవచ్చు''అని ఆది శ్రీనివాస్ అన్నారు.



## భారీ వర్షాలు.. తెలంగాణలో 2 లక్షలకు పైగా ఎకరాల్లో పంట నష్టం

హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు, 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. మొత్తం 2,20,443 ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లాలవారీగా పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు వెల్లడించారు. నివేదిక ప్రకారం.. 1,09,626 ఎకరాల్లో వరి, 60,080 ఎకరాల్లో పత్తి, 6,751 ఎకరాల్లో సోయాబీన్, 639 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలి : 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు

దిల్లీ: జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి రూ.7వేల కోట్లు నష్టం వస్తుందని అంచనా ఉన్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో జరిగిన 'జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాల సమావేశం'లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ తరఫున భట్టి విక్రమార్క హాజరుకాగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా మంత్రులు డిమాండ్ చేశారు. కొత్త జీఎస్టీ ప్రతిపాదనలతో




మొత్తంగా రూ.2లక్షల కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు. జీఎస్టీ కౌన్సిల్ భేటీలో తమ ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు.



## తహసీల్దార్ నివాసంలో ఏసీబీ సోదాలు.. రూ.కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు

హనుమకొండ: ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు నివాసంలో శుక్రవారం ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుపై హనుమకొండ చైతన్యపురిలోని ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలు తనిఖీలు నిర్వహించాయి. ఉదయం నుంచి సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు దాదాపు రూ.5కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్టు సమాచారం. రూ.1.15 కోట్ల విలువైన ఇంటి పత్రాలు, రూ.1.42 కోట్ల విలువైన 17.10 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.23.84లక్షల విలువైన 70 తులాల బంగారం, రూ.92వేల విలువైన 1,791 గ్రాముల వెండి వస్తువులు, రూ.34.78 లక్షల విలువైన 6 వాహనాలు, రూ.3.28 లక్షల విలువైన చేతి గడియారాలు, రూ.16.43 లక్షల విలువైన గృహోపకరణాలను గుర్తించారు. హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి, ధర్మసాగర్, కాజీపేట మండలాల్లో కూడా నాగేశ్వరరావు గతంలో తహసీల్దార్‌గా పనిచేశారు.

## తెలంగాణకు మరోసారి బిగ్ రెయిన్ అలర్ట్

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో, పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, గాలివేగం గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ పేర్కొంది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కొమరం భీం, అసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.



* **కామారెడ్డి జిల్లాలో రికార్డు స్థాయి వర్షపాతం:**

రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం కామారెడ్డి జిల్లాలో నమోదైంది. గాంధారి మండలంలో ఏకంగా 27 సెం.మీ.ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్నిచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఐఎండీ వివరాల ప్రకారం వర్షాపాతం వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో 24 సెం.మీ, నిర్మల్ జిల్లా ముధోల్ 22 సెం.మీ, కామారెడ్డి జిల్లా సదాశివనగర్ 16 సెం.మీ, లింగంపేట్ 16 సెం.మీ, నిజామాబాద్ జిల్లా వర్నిలో 16 సెం.మీ, డిచ్‌పల్లిలో 15 సెం.మీ, భీంగల్ లో 13 సెం.మీ, మెదక్ లో 12 సెం.మీ, కరీంనగర్ జిల్లా గంగాధరలో 12 సెం.మీ, జగిత్యాల జిల్లా కత్లాపూర్ లో 11 సెం.మీ, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ లో 11 సెం.మీ, నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 11 సెం.మీ, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తిలో 10 సెం.మీ, కామారెడ్డి జిల్లా బిక్నూర్ లో 9 సెం.మీ, చొప్పున వర్షాపాతం నమోదైంది.

## నిమ్స్ వైద్యులకు మంత్రి దామోదర అభినందన

నిమ్స్‌లో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు.

**లక్షల మంది పేదలకు సేవలు..**

నిమ్స్‌లో ఈ ఏడాది తొలి 7 నెల్లలో (జనవరి నుంచి జులై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తెలిపారు. ఇందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని ఆయన తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో, నిమ్స్‌కు వచ్చే పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ..ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా చేశామని ఆయన వెల్లడించారు.. ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీకి రోజుకు 80 నుంచి వంద మంది పేషెంట్లు వస్తున్నారని డైరెక్టర్ బీరప్ప తెలిపారు. ఇందులో సగం మందికిపైగా పేషెంట్లు ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొంది, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కు వస్తున్నారని బీరప్ప వెల్లడించారు. కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ ఆపరేషన్లు చేసి, పేషెంట్లు పూర్తిగా కోలుకోకముందే వారిని డిశ్చార్జ్ చేసి, నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌కు పంపిస్తున్నారని ...ఇలాంటి కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

**పలు సూచనలు చేసిన మంత్రి..**

నిమ్స్ అందిస్తున్న సేవల పట్ల డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని మంత్రి అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తున్న పేషెంట్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వీలైనంత త్వరగా పేషెంట్లను అడ్మిట్ చేసుకుని, ట్రీట్‌మెంట్ అందించాలని ....ఎమర్జన్సీ వార్డులో అవసరమైన చికిత్స అందించి, సంబంధిత వార్డుకు పేషెంట్‌ను షిఫ్ట్ చేయాలన్నారు. ఎమర్జన్సీకి వచ్చే పేషెంట్లలో నేరుగా నిమ్స్‌కు వచ్చే వారికి, ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి రిఫరల్‌పై వచ్చే వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

# ఆర్థిక వృద్ధిలో దూసుకెళ్తోన్న భారత్..




## తొలి త్రైమాసికంలో 7.8% జంప్

**న్యూఢిల్లీ:** మన భారత ఆర్థిక వ్యవస్థ మళ్లీ సత్తా చాటింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 7.8% ఆర్థిక వృద్ధిని సాధించింది. ఇది నిజంగా గొప్ప విషయం. గత సంవత్సరం ఇదే సమయంలో 6.5% ఉన్న వృద్ధి రేటుతో పోలిస్తే, ఈసారి అంచనాలను మించిపోయామని చెప్పవచ్చు. ఈ గణాంకాలను నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ ఆగస్టు 29న విడుదల చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో 6.5 శాతం వృద్ధి నమోదవడంతో పోలిస్తే ఇది ఎంతో మెరుగైన ఫలితంగా చెప్పొచ్చు.

### అంచనాలను మించి గ్రోత్

ఈ వృద్ధి రేటు అనలిస్ట్‌లు, రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా అంచనా వేసిన 6.5 శాతం కంటే ఎక్కువగా ఉంది. దీని ద్వారా ఇండియా ఆర్థిక వ్యవస్థలో పట్టు పెంచుకుందన్న విషయం స్పష్టమవుతుంది. సేవల రంగం, మానుఫాక్చరింగ్ రంగం బలంగా పనిచేయడం వృద్ధికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

### గణాంకాలు ఎలా ఉన్నాయంటే

రియల్ జీడీపీ అంటే ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత వచ్చే నిజమైన ఆర్థిక వృద్ధి. ఇది రూ. 47.89 లక్షల కోట్లకు పెరిగింది, గతేడాది ఇదే త్రైమాసికంలో రూ. 44.42 లక్షల కోట్లు ఉండేది. అదే సమయంలో నామమాత్రపు జీడీపీ (ద్రవ్యోల్బణంతో కలిపిన మొత్తం విలువ) రూ. 86.05 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయంలో రూ. 79.08 లక్షల కోట్లుగా ఉంది.

### బలంగా నిలిచిన వ్యవసాయం

వ్యవసాయ రంగం 3.7 శాతం వృద్ధిని సాధించింది. ఇది గతేడాది ఇదే కాలంలో 1.5 శాతం మాత్రమే ఉంది. గత వృద్ధితో పోలిస్తే ఇది చాలా గొప్ప అభివృద్ధి అని చెప్పవచ్చు. మంచి పంటల దిగుబడి, వర్షాల ప్రభావం, గ్రామీణ ఆదాయం పెరగడం వల్ల వ్యవసాయ వృద్ధి పెరిగినట్లు తెలుస్తోంది.

### స్థిరంగా మాన్యుఫాక్చరింగ్

మాన్యుఫాక్చరింగ్ రంగం కూడా బాగానే పనిచేసింది. 7.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది గత సంవత్సరం త్రైమాసికంలో 7.6 శాతం ఉండేది. ఈ మార్పు తక్కువైనా, స్టేబుల్ ప్రొడక్షన్‌కి ఇది సంకేతంగా చెప్పుకోవచ్చు.

### సేవల రంగం కీలక పాత్ర

సేవల రంగం ముఖ్యంగా ఫైనాన్స్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్ వంటి విభాగాలు ఈ త్రైమాసిక వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరగడం, టెక్నాలజీ సేవలు విస్తరించడం వల్ల ఈ రంగం చురుగ్గా కొనసాగుతోంది.

### చైనా కంటే వేగంగా భారత్

ఇండియా ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది. చైనా ఈ కాలంలో కేవలం 5.2 శాతం మాత్రమే వృద్ధి సాధించింది. ఇదే సమయంలో ఇండియా 7.8 శాతం వృద్ధితో ముందుంది.

# రిలయన్స్ ఎంజీఎం.. జియో ఐపీవోపై కీలక ప్రకటన చేసిన ముఖేశ్ అంబానీ..!



**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ 48వ వార్షిక సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిలయన్స్ గ్రూప్ చీఫ్ ముఖేష్ అంబానీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జియో ఐపీవోపై కీలక ప్రకటన చేశారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని.. 2026 తొలి అర్ధభాగం వరకు ఐపీవో తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. భారతదేశ పురోగతి మార్గంలో కంపెనీ ముందుకు సాగుతోందన్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ ముందుకెళ్తుందన్న ఆయన.. దాన్ని ఎవరూ ఆపలేరన్నారు. భారతదేశం ఇప్పటికే ప్రపంచంలోని అగ్ర నాలుగు ఆర్థిక వ్యవస్థలలో చేరిందని.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశ జీడీపీ అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రపంచ మోడల్‌ను భారతదేశం కాపీ చేయాల్సిన అవసరం లేదన్నారు.

ఇండియా ఫస్ట్ మోడల్‌ను సృష్టించగల సామర్థ్యం తమకు ఉందన్నారు. డీప్ టెక్నాలజీని ఉపయోగించి, మా మోడల్ భారతదేశ భద్రతను బలోపేతం చేస్తుందని.. ఇది ప్రజల జీవితాలను మెరుగుపరచడంతోపాటు పర్యావరణాన్ని కాపాడుతుందన్నారు. రిలయన్స్ తన స్వర్ణ దశాబ్దం ముగింపు దిశగా పయనిస్తుండగా.. భారతీయ కలను సాకారం చేసుకోవడానికి తాకు అంకితభావంతో ఉన్నామని ముఖేష్ అంబానీ పేర్కొన్నారు. తమ ప్రతి వ్యాపారాన్ని, డీప్-టెక్ సామర్థ్యాలతో బలోపేతం చేసుకుంటున్నామన్నారు. 'వీ కేర్' తత్వశాస్త్రంతో ప్రజల శ్రేయస్సు, పర్యావరణ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తున్నామని అంబానీ అన్నారు. కొత్త తరం నాయకత్వాన్ని శక్తివంతం చేయడానికి కంపెనీ కృషి చేస్తోందని, దీనికి కట్టుబడి ఉన్నామని ముఖేశ్ అంబానీ పేర్కొన్నారు. జియో ఇప్పుడు డీప్-టెక్ కంపెనీగా మారిందన్నారు.

జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ భారత్ ప్రపంచంలోనే మొట్టమొదటి నేటివ్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి కంపెనీ పునాది వేస్తోందని అన్నారు. జియో నేడు 50 కోట్లకు పైగా కస్టమర్లకు సేవలందిస్తోందన్నారు. ప్రతి భారతీయుడి నమ్మకంతో ఈ విజయం సాధించామన్నారు. 5 నుంచి సేవల వరకు పూర్తిగా భారతదేశంలో అభివృద్ధి చేయబడిన సాంకేతికతతో కంపెనీ తన ముద్ర వేసిందన్నారు. జియో ఎయిర్‌ఫైబర్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద స్థిర వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తుందని.. ఇది ప్రతి నెలా 10 లక్షలకుపైగా గృహాలకు తన సేవలను అందిస్తోందని తెలిపారు. జియో కంపెనీ సాంకేతిక మౌలిక సదుపాయాలను భారతదేశంలో పూర్తిగా రూపొందించి అభివృద్ధి చేశామని, జియో దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును రూపొందిస్తోందని ఆకాశ్ అంబానీ అన్నారు.




# హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్ గోల్..




## చైనాను చిత్తు చేసిన టీమిండియా

**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. ఆరంభ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాకు షాకిస్తూ పాయింట్ల ఖాతా తెరిచింది టీమిండియా. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగగా ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. సారథి జోరుకు జుగురాజ్ సింగ్ గోల్ కూడా తోడవ్వడంతో 4-3తో మ్యాచ్‌ను ముగించిన టీమిండియా గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచింది.రాజ్‌గిర్ వేదికగా ప్రారంభమైన ఆసియా కప్‌లో భారత పురుషుల హాకీ జట్టు అదిరే ఆటతో చైనాను మట్టికరిపించింది. గ్రూప్ దశలోని తొలి పోరులో ఆట మొదలైన కాసేపటికే ప్రత్యర్థి జట్టు తొలి గోల్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయినా సరే ఒత్తిడికి లోనవ్వని భారత బృందం టాప్ గేర్‌లో ఆడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చైనా డిఫెన్స్‌ను ఛేదిస్తూ హ్యాట్రిక్ గోల్స్ చేశాడు.చైనా ఆటగాళ్లు సైతం మరో రెండు గోల్స్ చేయడంతో స్కోర్లు సమం అయ్యాయి. ఉత్కంఠ నెలకొన్న వేళ.. జుగ్‌రాజ్ సింగ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపడంతో టీమిండియా ఆటగాళ్లు సంబురాలు చేసుకున్నారు. ఈ మెగా టోర్నీలో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిస్తే ఈ ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ బెర్తు కైవసం చేసుకుంటుంది.




# జూరిచ్ డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ చోప్రాకు రెండో స్థానం

**జూరిచ్:** ప్రపంచ చాంపియన్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా జూరిచ్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్లో రెండో స్థానంలో నిలిచాడు. 85.01 మీటర్లు జావెలిన్‌ను విసిరాడు. అయితే జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ ఆ టోర్నీలో టాప్ ప్లేస్ కొట్టేశాడు. అతను తన జావెలిన్‌ను 91.51 మీటర్ల దూరం



విసిరాడు. రెండో ప్రయత్నంలోనే అతను ఆ మార్క్ దాటేశాడు. తొలి రెండు ప్రయత్నాల్లోనూ వెబర్ 91 ప్లస్ మీటర్ల దూరానికి జావెలిన్‌ను విసిరాడు. జూరిచ్‌లో నీరజ్ పర్ఫార్మెన్స్ సరిగా సాగలేదు. ఆరంభంలో రెండు సార్లు 80 మీటర్ల దూరం వరకే తన త్రో వేశాడు. ఆ తర్వాత మూడు సార్లు ఫౌల్స్ తో నిరాశకు గురి చేశాడు. అయితే చివరి ప్రయత్నంలో అతను 85 మీటర్ల దూరం విసిరి ఊపిరి పీల్చుకున్నాడు. వరుసగా 26 టోర్నీల్లో నీరజ్ చోప్రా తొలి రెండు స్థానాల్లో నిలవడం గమనార్హం.

2012 లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన ట్రినిడాడ్ టొబాగో త్రోయర్ కేషార్న్ వాల్కాట్ 84.95 మీటర్లు విసిరి మూడవ స్థానంలో నిలిచాడు.

# సింధు నిష్క్రమణ.. ధృవ్-తనీష్ జోడీకీ నిరాశే



**పారిస్ :** ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఆరో పతకం దక్కించుకోవాలన్న పీవీ సింధు కల చెదిరింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు.. 14-21, 21-13, 16-21తో తొమ్మిదో సీడ్ ఇండోనేషియా అమ్మాయి పుత్రి కుసుమ వర్ధాని చేతిలో పోరాడి ఓడింది. 64 నిమిషాల పాటు హెూరాహెూరీగా జరిగిన పోరులో ఈ డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్.. తొలి గేమ్‌లో ఓడినా తర్వాత పుంజుకుని రేసులోకి వచ్చింది. తన అనుభవన్నంతా రంగరించి రెండో గేమ్‌ను గెలుచుకున్న తెలుగమ్మాయి.. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో తడబాటుకు గురై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# క్వార్టర్ ఫైనల్లో భారత మిక్స్‌డ్ ద్వయం ఓటమి..

## గోల్డెన్ ఛాన్స్ మిస్..!

**పారిస్:** బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత మిక్స్‌డ్ ద్వయం తనీషా క్రాస్టో, ధ్రువ్ కపిల జోడీ అద్భుత అవకాశాన్ని చేజార్చుకుంది. పదహారో రౌండ్‌లో ఐదో సీడ్ జంటపై సంచలన విజయంతో ఆశలు రేపిన ఈ జోడీ క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం హెూరాహెూరీగా జరిగిన పోరులో నాలుగో సీడ్ జంట చెన్ తంగ్‌జీ, తో ఇవీ(మలేషియా) చేతిలో పరాజయం పాలైంది భారత ద్వయం. దాంతో, ఈ టోర్నీలో పతకం గెలిచిన మూడో భారత జంటగా రికార్డు నెలకొల్పే అవకాశాన్ని చేజార్చుకున్నారు తనీషా, ధ్రువ్.




పారిస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ జోరుకు తెరపడింది. పదహారో రౌండ్‌లో ఐదో సీడ్ జంట టాంగ్ చున్ మన్, త్సె యింగ్ సుయెట్కు షాకిచ్చిన తనీషా, ధ్రువ్ జంట క్వార్టర్ ఫైనల్లో మాత్రం నిరాశపరిచింది. నాలుగో సీడ్ తంగ్‌జీ, ఇవీలను దీటుగా ఎదుర్కోలేకపోయింది.మ్యాచ్ ఆరంభంలో అదరగొట్టిన భారత ద్వయం ఆ తర్వాత తడబడింది. 37 నిమిషాల్లోనే ముగిసిన పోరులో 17-21, 13-21తో భారత జోడీ మ్యాచ్ చేజార్చుకుంది. తద్వారా.. ఈ పోటీల్లో చరిత్ర సృష్టించే అవకాశం చేజారింది. వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో మనదేశం నుంచి అశ్వినీ పొన్నప్ప, జ్వాలా గుత్తా(2011), సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి(2022)లు మాత్రమే పతకం సాధించారు.

# కుర్రాళ్లను క్లీన్ బౌల్డ్ చేస్తున్న హనీరోజ్



టాకీస్: ఒకే ఒక్క సినిమాతో తెలుగు ప్రేక్షకులను క్లీన్ బౌల్డ్ చేసింది అందాల భామ హనీరోజ్. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ బ్యూటీ తెలుగులో నటసింహం నందమూరి బాలకృష్ణ సరసన వీరసింహారెడ్డి సినిమాలో సందడి చేసింది. చూడటాన్ని చబ్బీగా ఉ ఒడే ఈ చిన్నది.. తన అందంతో కవ్విస్తుంది. వీరసింహారెడ్డి సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ అలరించింది హనీ రోజ్. అయితే వీరసింహారెడ్డి ఆమె ఫస్ట్ తెలుగు సినిమా కాదు. ఈ వర్షం సాక్షిగా అనే మూవీతో 2014 ఆమె తెలుగు ఆడియెన్స్‌ను పలకరించినా.. ఆ సినిమా అంతగా క్లిక్ అవ్వలేదు. అయితే బాలయ్య సినిమా తర్వాత ఈ చిన్నది తెలుగులో మరో సినిమాలో కనిపించలేదు. చాలా రోజుల తర్వాత హనీ రాచెల్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మలయాళంతో పాటు పలు భాషల్లోనూ విడుదల కానుంది. ఇక సోషల్ మీడియాలో హనీ రోజ్ ఎంత యాక్టివ్. ఎప్పటికప్పుడు ఫోటోలు పెడుతూ కుర్రాళ్లను కవ్విస్తూ ఉంటుంది. మూవీస్ కంటే షాపింగ్ మాల్స్ ఓపినింగ్స్ తోనే ప్రస్తుతం ఎక్కువగా గడిపేస్తుంది హనీరోజ్. తెలుగులో వీరసింహారెడ్డి సినిమా చేసిన ఈ అమ్మడు ఇప్పుడు కనిపించకుండా పోయింది. సోషల్ మీడియాలో హనీ రోజ్ షేర్ చేసే ఫోటోలకు కుర్రాళ్లలో విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఈ బ్యూటీ పంచుకున్న ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# విశాల్, ధన్సిక నిశ్చితార్థం

**కోలీవుడ్ నటుడు విశాల్, నటి సాయి ధన్సికల నిశ్చితార్థం**

**విశాల్ పుట్టినరోజు సందర్భంగా చెన్నైలో వేడుక**

**కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల హాజరు**

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఎంగేజ్‌మెంట్ ఫొటోలు..**



**టాకీస్:** కోలీవుడ్ యాక్షన్ హీరో, విలక్షణ నటుడు విశాల్ తన పుట్టినరోజున అభిమానులకు తీపి కబురు అందించారు. తన ప్రేయసి, ప్రముఖ నటి సాయి ధన్సికతో ఆయన నిశ్చి తార్థం శుక్రవారం ఘనంగా జరిగింది. చెన్నైలోని విశాల్ నివాసంలో జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంట ఉ ంగరాలు మార్చుకుంటున్న ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.గత మే నెలలోనే తాము ప్రేమలో ఉన్న విషయాన్ని విశాల్, ధన్సిక అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి, విశాల్ పుట్టిన రోజైన ఈరోజే వీరి వివాహం జరగాల్సి ఉంది. అయితే, విశాల్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తు న్న నడిగర్ సంఘం (తమిళ నటీనటుల సంఘం) భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడం తో పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని విశాల్ గతంలో ప్రకటించారు. ఇక నటి సాయి ధన్సిక విషయానికొస్తే, జూనియర్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి తన ప్రతిభతో ఎదిగారు. సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'కబాలి' చిత్రంలో ఆయన కూతురి పాత్రలో అద్భుతంగా నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆమెకు తమిళంతో పాటు తెలుగులోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఇద్దరూ తమ కెరీర్‌లో బిజీగా ఉండగా, త్వరలోనే వీరి పెళ్లి తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

# నాగ్ బర్త్‌డే స్పెషల్ మ్యాష్ అప్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలు న్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మధుడు, కింగ్ అనగా నే గుర్తొచ్చేది మాత్రం నాగార్జుననే. నటనలో శివ నుంచి మొదలు ఇక తనకు తిరుగులేదని నిరూ పించుకున్నాడు.66 ఏళ్ల వయసులోనూ భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలతో అలరిస్తున్నాడీ హీరో. శుక్రవారం అక్కినేని హీరో పుట్టినరోజు సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఓ స్పెషల్ మ్యాష్‌అప్ వీడియోను విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఆయన చేసిన సినిమాల్లోని కొన్ని పాత్రల ఫేమస్ డైలాగులతో చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఈ ఫీల్డ్‌లో కొత్తగా ట్రై చేయాలంటే నేనే' అంటూ నాగార్జున డైలాగ్ ఆకట్టుకుంటోంది. నాగ్ బర్త్ డే సందర్భంగా అయనకు సినీ రాజకీయ ప్రముఖులు,అభిమానులు విషెస్ తెలిపారు.

# జాన్వీ మూవీ సన్నీ సంస్కార్ కీ తులసి కుమారి




**టాకీస్:** జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'. జాన్వీ లేటెస్ట్ చిత్రమిది. ఓ యువ జోడీ ప్రేమ ప్రయాణం నేపథ్యంలో శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్నారు. దసర కానుకగా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్నట్లు-టీజర్ ఆధారంగా అర్థమవుతోంది.

## అఖండ-2 విడుదల
# మరింత ఆలస్యం

**టాకీస్:** విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న 'అఖండ 2: తాండవం' విడుదల వాయిదా పడింది. నిర్మాణానంతర పనుల కోసం అదనపు సమయం



కేటాయించాల్సి రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా నిర్మాణ సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని విడుదల చేయాలని ఇదివరకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని మరింత నాణ్యమైన రీరికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ హంగుల్ని జోడించడం కోసం సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్టు నిర్మాణ వర్గాలు తెలిపాయి.

# 'జటాధర' నుంచి శిల్పా శిరోద్కర్ ఫస్ట్ లుక్ రిలీజ్

**టాకీస్:** యువ కథానాయకుడు సుధీర్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జటాధర'. ఈ సినిమాకు వెంకట్ కళ్యాణ్ అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తుండగా.. వెంకట్ కళ్యాణ్ కథనందిస్తున్నాడు. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాతో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న



ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ ఇటీవల టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా మూవీ నుంచి మరో పాత్రను పరిచయం చేశారు మేకర్స్. ఈ సినిమాలో బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ శోభ అనే కీలక పాత్రలో నటించబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా శోభ ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది.

# ఆఖరి అస్త్రాన్ని ప్రయోగించిన కృతి శెట్టి..



టాకీస్: టైటిల్‌కు తగ్గట్లే ఉప్పెనలా ఇండస్ట్రీకి దూసుకొచ్చిన బ్యూటీ కృతి శెట్టి. ఏం జరిగిందో తెలుసుకుని తేరుకునేలోపే ఉప్పెన, శ్యామ్ సింగరాయ్, బంగార్రాజుతో దెబ్బకు గోల్డెన్ లెగ్ అయిపోయింది. కానీ అంతలోనే టైమ్ టర్న్ అయింది.. వరసగా ఫ్లాపులొచ్చాయి. మాచర్ల నియోజకవర్గం, వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, కస్టడీ, మనమే ఫ్లాపులతో కృతి శెట్టి రేంజ్ ఒక్కసారిగా పడిపోయింది. తెలుగులో కృతికి ఆఫర్స్ నిల్.. ఇక్కడ మనమే తర్వాత పూర్తిగా ఖాళీ అయిపోయారు. ఇదే సమయంలో తమిళ, మలయాళం నుంచి మాత్రం ఈమెకు ఆఫర్స్ బాగానే వస్తున్నాయి. మలయాళంలో ఆర్మ్ సినిమాతో బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన కృతి.. తమిళంలోనూ కార్తి, జయం రవి, ప్రదీప్ రంగనాథన్ లాంటి హీరోలతో నటిస్తున్నారు.ఒకప్పుడు సోషల్ మీడియాలో మాత్రమే గ్లామర్ షో చేసిన కృతి శెట్టి... ఇప్పుడు సినిమాల్లోనూ మొదలు పెట్టారు. విఘ్నేష్ శివన్ తెరకెక్కిస్తున్న లైక్‌లో కృతి గ్లామర్ ప్రధానాకర్షణ. అలాగే వా వాతియార్‌లోనూ ఫుల్లుగా అందాలను ఆరబోస్తున్నారు బేబమ్మ. ఇక సోషల్ మీడియాలో చెప్పనక్కర్లేదు.. మొత్తానికి అందమే ఆయుధంగా దూసుకుపోతున్నారు ఈ బ్యూటీ.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.